# అతి తెలివి వ్యాపారం



భూపతికి అవసాన కాలం సమీపించి తన తదనంతరం కొడుకు ఆస్తి కాపాడుకుంటాడో లేదోననే భయంతో అమ్ముకునే హక్కు లేకుండా వీలునామా రాశాడు. తనకున్న పొలం, ఇల్లు తర తరాలుగా అనుభవిస్తూ ఆస్తిని కాపాడుకుంటారని భూపతి ఆశ.

భూపతి చనిపోయిన తర్వాత కొడుకు గజపతి ఆస్తికి వారసుడయ్యాడు. ఒకసారి వరుసగా రెండు సంవత్సరాలు పంట చేతికి అందలేదు. తుఫాన్ వచ్చి పంట నాశనమైంది. పశువుల పాక కూలి పశువులు చనిపోయాయి. మరుసటి సంవత్సరం పొలం దున్నడానికి పశువులు కొనవలసి వచ్చింది. ఎరువులు, విత్తనాలకు, కూలీలకు డబ్బు ఖర్చు పెట్టడానికి భూపతి దగ్గర డబ్బు లేదు. పొరుగు గ్రామంలో వున్న మామ నాగయ్యను అప్పు అడిగాడు.

"అల్లుడూ! ఈ రోజుల్లో వ్యవసాయం లాభ సాటిగా లేదు. తెగుళ్ళు సోకి పంట చేతికి రావడం

లేదు. గాలి వానలొచ్చి పంట నాశనమై పోతున్నది. వ్యాపారస్తులే హాయిగా వున్నారు. ఏదైనా వ్యాపారం చెయ్యి!" అని అల్లుడికి సలహా ఇచ్చాడు నాగయ్య.

"నాకూ అప్పుడప్పుడూ అటువంటి ఆలోచన వస్తుంది. కాని నా దగ్గర వ్యాపారానికి పెట్టుబడి లేదు" అన్నాడు గజపతి.

"అందరూ పెట్టుబడి పెట్టి వ్యాపారం చేస్తారను కోవడం నీ తెలివి తక్కువ. ఎక్కువ మంది అప్పు తెచ్చి వ్యాపారం మొదలు పెడతారు" అన్నాడు నాగయ్య.

"నాకు వ్యాపారంలో అనుభవం లేదు. కర్మ చాలక నష్టం వస్తే ఎట్లా? స్వంత డబ్బు అయితే పోయినా ఫర్వాలేదు. అప్పు తెచ్చి పెట్టిన డబ్బు పోతే ఎట్లా తీర్చాలి?" అన్నాడు గజపతి.

"తీర్చకపోతే ఏమవుతుంది?" అని నవ్వాడు నాగయ్య.

గజపతి ఆశ్చర్య పోయాడు.

"అప్పు తీర్చకపోతే ఇచ్చిన వాళ్ళు వూరు కుంటారా?" అన్నాడు.

"ఊరుకోకపోతే వురి పెట్టుకుంటారు. ఆస్తి నీ పేరున వున్నా నీకు అమ్ముకునే హక్కులేదు. కాబట్టి అప్పు ఇచ్చిన వాళ్ళు నీ ఆస్తి స్వాధీనం చేసుకోలేరు" అన్నాడు నాగయ్య.

గజపతికి మామగారి వుద్దేశ్యం అర్థమైంది. తండ్రి తనకు అమ్ముకునే హక్కులేకుండా, అను భవించే హక్కు మాత్రమే ఇవ్వడం వల్ల ఇప్పుడు మేలే అయింది అనుకున్నాడు.

లక్ష వరహాలు అప్పుచేసి వ్యాపారం మొదలు పెట్టాడు. రైతుల దగ్గర పండిన ధాన్యం, అపరాలు కొని బళ్ళకు ఎత్తించి పట్టణంలో వ్యాపారులకు అమ్మడం, పట్టణం నుంచి రైతులకు కావలసిన వస్తువులు తెచ్చి పల్లెల్లో అమ్మడం అతని వ్యాపారం. అదృష్టవశాత్తు అతనికి వ్యాపారంలో ఏ మాత్రం అనుభవం లేకపోయినా ఆ సంవ త్సరం లాభమే వచ్చింది. వడ్డీ ఇచ్చివేయగా, పది వేల వరహాలు మిగిలాయి.

అయితే గజపతికి సంతోషం కలగలేదు. సంవత్సరానికి పదివేల వరహాలు మిగిలినా అప్పు తీర్చడానికి పదేళ్ళు పడుతుంది. ఆ తర్వాత మరొక పదేళ్ళకి గాని తను లక్ష వరహాలు కూడబెట్టలేడు. అంటే తను లక్షాధికారి కావడానికి ఇరవై ఏళ్ళు పడుతుంది అని లెక్క వేశాడు. అతనికి అసంతృప్తి కలిగింది. ఎంతో శ్రమ పడితే ఇరవై ఏళ్ళకి తను లక్షాధికారి అవుతాడు. అదే తను వ్యాపారంలో నష్టం వచ్చిందని అప్పులు ఎగ్గొడితే క్షణంలో లక్షాధికారి అవుతాడు. అప్పులు ఇచ్చిన వాళ్ళు మోసగాడని అంటే అనుకుంటారు. కొన్నాళ్ళు పోతే వాళ్ళు మర్చిపోతారు అను కున్నాడు.

అతని ఆలోచన వెంటనే అమలులో పెట్టాడు. లక్ష వరహాలు మామ గారింట్లో దాచిపెట్టి వ్యాపారంలో దివాలా తీశానని ప్రకటించాడు. అప్పులు ఇచ్చిన షావుకార్లు లబోదిబో అని మొత్తుకున్నారు. గజపతికి ఆస్తి అమ్మే హక్కు లేదని తెలుసుకుని వారికి మతిపోయింది. గజపతి

నుంచి డబ్బు రాబట్టుకోవడం ఎట్లాగో అర్థంకాక రాజుగారికి ఫిర్యాదు చేశారు.

విజయపురి మంత్రి గుణసేనుడు చాలా తెలివిగలవాడు. వేగులను పంపించి గజపతి చేసిన వ్యాపారం గురించి, అందులో నష్టం వచ్చే అవకాశాలను తెలుసుకుని రమ్మన్నాడు. వాళ్ళు చెప్పిన దాన్ని బట్టి గజపతికి వ్యాపారంలో నష్టం వచ్చే అవకాశం లేదు. ఎవరూ అతన్ని మోసం చేయలేదు. సజావుగా సాగుతున్న వ్యాపారాన్ని ఎత్తివేశాడు. గజపతి అప్పుల వాళ్ళని మోసం చేశాడని గుణసేనుడు అర్థం చేసుకున్నాడు. ఆస్తి అమ్ముకునే హక్కు లేకపోవడాన్ని సాకుగా తీసుకుని అప్పులు ఇచ్చిన వాళ్ళని మోసం చేశాడని గ్రహించాడు. అతనికి ఎట్లా బుద్ధి చెప్పాలో ఆలోచించాడు.

గజపతిని, అతనికి అప్పులు ఇచ్చిన షావుకార్లని న్యాయస్థానానికి పిలిపించాడు మంత్రి.

"గజపతీ! నువ్వు షావుకార్ల దగ్గర లక్ష వరహాలు అప్పు తీసుకున్న మాట నిజమేనా?" అని ప్రశ్నించాడు మంత్రి.

"నిజమే!" అని ఒప్పుకున్నాడు గజపతి.

"నీకు వ్యాపారంలో నష్టం వచ్చిందా?"

"ఔను".

"నీకు ఆస్తి వుందనే ధీమాతోనే షావుకార్లు అప్పు ఇచ్చారు. అవునా?"

"ఔను" అన్నాడు గజపతి.

"మరికనేం? నీ ఆస్తి అమ్మి అప్పులు తీర్చు" అన్నాడు మంత్రి.

"ఆస్తి అమ్ముకునే హక్కు లేకుండా వీలునామా రాశాడు నా తండ్రి. అందువల్ల అమ్మడానికి అశక్తుణ్ణి. లేకపోతే ఆస్తి అమ్మి అప్పులు తీర్చి వుండేవాడిని" అన్నాడు గజపతి.

"అలాగా! అయితే నీ ఆస్తిని వంద సంవత్సరాల వరకూ నీకు అప్పులిచ్చిన షావుకార్లకి అద్దెకు ఇస్తున్నట్లు పత్రం రాసివ్వు. వంద సంవత్సరాల తర్వాత నీ ఆస్తి నీ వారసులకు చెందుతుంది. అప్పటివరకూ వీళ్ళు నీ ఆస్తి అనుభవిస్తుంటారు" అని తీర్పు చెప్పాడు గుణసేనుడు.

గజపతి మంత్రి చెప్పిన తీర్పుతో బిత్తరపోయాడు. వంద సంవత్సరాల వరకూ అద్దెకు ఇస్తున్నట్లు రాసిస్తే ఇంకేం వుంటుంది? ఆస్తి మీద హక్కు పూర్తిగా వదులుకున్నట్లే అని అతనికి అర్థమైంది.

"మహాప్రభో! నా ఆస్తి విలువ పదిలక్షలు చేస్తుంది. లక్ష వరహాల కోసం వంద సంవత్సరాలు అద్దెకు ఇమ్మనడం అన్యాయం" అని మొత్తుకున్నాడు.

"అది నీకు ఇష్టం లేకపోతే నెలరోజుల్లో అప్పులు తీర్చు. వ్యాపారంలో నష్టం వచ్చిందని మోసం చేశావని నాకు తెలుసు" అన్నాడు మంత్రి.

గజపతి మామగారింట్లో దాచిన లక్ష వరహాలు తెచ్చి అప్పులు తీర్చాడు. ఆ తర్వాత అతనికి నిజంగా అవసరం వచ్చినా ఎవరూ అప్పు ఇవ్వడానికి సాహసించలేదు. గజపతి మోసగాడనే పేరు మిగిలిపోయింది.